క్లుప్తంగా

30న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 30న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని హోచిమన్ భవన్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కెసీ బాదుల్లా, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారదమ్మ, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోటును ప్రభుత్వమే భరించాలి

కడప కార్పొరేషన్: విద్యుత్ లోటును ప్రభుత్వమే సబ్సిడీగా భరించాలని సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్ ఎదుట సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ భారాలను తక్షణం ఆపకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, మహబూబ్ తార, వినోద్, రమణమ్మ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

బస్సు జాతా జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర హామీల అమలు కోసం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు జరిగే బస్సు జాతాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ నాయక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర విభజన హామీల అమలు కోసం జరిగే బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆత్మ విశ్వాసంతో ఉద్యోగాలు సాధించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పోటీ పడే అభ్యర్థులు ఆత్మ విశ్వాసంతో ఉద్యోగాలు సాధించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పేర్కొన్నారు. గురువారం నగరంలోని వెంకటసాయి, అయేషా కోచింగ్ సెంటర్లలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ మోడల్ పరీక్ష సందర్భంగా ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రాహుల్ దేవ్, నాగేంద్ర, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ పథకాన్ని వినియోగించుకోవాలి

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ కేఎంమోహన్ అన్నారు. గురువారం శంకరాపురం శాఖ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ 400 రోజులకు డిపాజిట్ చేస్తే అత్యధికంగా 7.75 శాతం వడ్డీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ సాయినాథ్, చీఫ్ మేనేజర్లు క్రిష్ణ ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.కవిత గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సహాయం, రక్షణ, సలహా వ్యవస్థ గురించి ఆమె వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 14567 నెంబరుపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారిని సంప్రదించాలని ఆమె కోరారు.

మేయర్ సురేష్ బాబుకు పరామర్శ



కడప మేయర్ సురేష్‌బాబుతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్ బాబును మంత్రి ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. గురువారం చిన్నచౌకులోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో పార్టీ కార్యక్రమాల్లో తిరిగి పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లికార్జున, రామలక్ష్మణరెడ్డి, దాసరి శివ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కడప కార్పొరేషన్: కడప నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గురువారం స్థానిక 41వ డివిజన్‌లోని రవీంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల వారికి కలిగిన మేలును వివరించారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను దీవించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా రాపూరి సునీత అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాదీవెన, ఆరోగ్యశ్రీ, ఈబీసీ నేస్తం, పింఛన్ కానుక, ఇంటి స్థలం వంటి పథకాల వల్ల రూ.10.17లక్షల లబ్ధి కలిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఏ. పుష్పలత మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్ కానుక, చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.88 లక్షల మేలు జరిగిందని తెలిపింది. సయ్యద్ గులాబీజాన్ అనే మహిళ మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తమ కుటుంబానికి వివిధ పథకాల వల్ల రూ.9.17లక్షలు మేలు జరిగిందని ఆనందం వ్యక్తం చేసింది. పింఛన్లను తెల్లవారుజామునే ఇంటి తలుపు తట్టి ఇస్తున్నారని వృద్ధులు, వితంతువులు సంతోషంతో చెప్పారు. ప్రజలకు మేలు చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ మళ్లీ రావాలని వారు ఆకాంక్షించారు.

పాఠశాలలో వసతుల కల్పనకు హామీ

అనంతరం రవీంద్రనగర్‌లోని మున్సిపల్ పాఠశాలను డిప్యూటీ సీఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సరైన వసతులు లేవని, ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి పాఠశాలలో నీటి వసతి చేసి, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రామక్రిష్టారెడ్డిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, మాజీ కార్పొరేటర్ జమాల్‌వలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, మియ్యా, తోటక్రిష్ణ, ఉమైర్, శివకేశవ, ఎన్. సుబ్బారెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, చైతల్య పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

సంప్రదాయాలను గౌరవించాలి

కడప కార్పొరేషన్: భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలను పరిరక్షిస్తూ గౌరవించాలని వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు జరుగు వెంకట రమణారెడ్డి (నాని) అన్నారు. పాత కడపలో గురువారం సాయంత్రం సంక్రాంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా బండలాగుడు పోటీలు, గొబ్బెమ్మలు, మహిళల ఆటల పోటీలు, చెక్క భజనలు, చిన్న పిల్లల డ్యాన్స్, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన 1వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. చెన్నయ్యతో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పులి ఓబయ్యకు ఘన నివాళి



పులి ఓబయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ తండ్రి పులి ఓబయ్యకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలు ఘన నివాళులు అర్పించారు. గురువారం స్థానిక పాత రిమ్స్ సమీపంలోని కాంగ్రిగేషనల్ చర్చిలో నిర్వహించిన సంస్మరణ సభలో వారు పాల్గొని ఓబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, డా.సొహైల్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాకవి వేమన జయంతి



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ ఇన్‌ఛార్జి వీసీ రంగ జనార్దన్, బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో గురువారం వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సాసామాజిక కట్టుబాట్లు, మనిషి ప్రవర్తనలోని లోటుపాట్లను పద్యాల ద్వారా ప్రశ్నించిన గొప్ప కవి వేమన అన్నారు. సమాజంలోని అసమానతలను, మూఢ నమ్మకాలను పోగొట్టడానికి పదునైన పదజాలంతో పద్యరచన చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్ రెడ్డి, ఈవెంట్ కోఆర్డినేటర్ వై. మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో వేమన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖ విభాగాధిపతి డా. యు. రమ్యజ్యోతి వేమన గురించి వివరించారు. కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డా. కె. చెన్నకేశవరెడ్డి, డా. హజరతయ్య, డా. రాజీవ్‌బాబు, డా. ఎం.వి.ఎస్. సుధారాణి పాల్గొన్నారు.

వేమన జయంతితో ప్రభుత్వ ప్రతిష్ట ఇనుమడించింది

– వైవీయూ ఇన్‌ఛార్జి వీసీ రంగ జనార్దన్

కడప కల్చరల్ : విశ్వకవి వేమన జయంతిని ఘనంగా నిర్వహించడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట మరింత ఇనుమడించిందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ జి.రంగ జనార్దన అన్నారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆయన కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ కేంద్రం సిబ్బందితో కలిసి వేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రంగ జనార్దన మాట్లాడుతూ ప్రజల మధ్య నేటికీ సంభాషణలు, సామెతలు, జాతీయాల రూపంలో వేమన పద్యాలు సజీవంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేమన విశిష్టతను కొనియాడుతూ ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించినందుకు ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశ్వవిద్యాలయం, బ్రౌన్ కేంద్రం పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి , జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు. గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు రమేష్‌రావు, హరిభూషణరా వు, జూనియర్ అసిస్టెంట్లు వెంకట రమణ, మౌనిక పాల్గొన్నారు.

ఆధునిక సామాజిక విప్లవ కారుడు వేమన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆధునిక సామాజిక విప్లవ కారుడు వేమన అని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్ బాష, శంకర్, తస్లీమ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సందర్శన

కడప వైఎస్ఆర్ సర్కిల్: జగనన్న కాలనీల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లును రూ. 5 లక్షలకు పెంచాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. గురువారం నగర శివార్లలోని చెర్లోపల్లె లే అవుట్‌ను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలకు అనుగుణంగా రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. రింగు రోడ్డునుంచి చెర్లోపల్లెకు తారు రోడ్డును నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దిలేటి, సావంత్ సుధాకర్, మల్లి ఖార్జున, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హజ్‌హౌస్‌ను సంరక్షించాలి

కడప రూరల్ : కడప నగర సమీపంలో నిర్మించిన హజ్‌హౌస్‌ను సంరక్షించాలని ముస్లిం నేతలు కోరారు. గురువారం రాత్రి స్థానిక షాహీ బాక్వెంట్ హాలులో తన్వీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సంఘ సేవకులు సయ్యద్‌సలావుద్దీన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీలు, ముస్లిం సంఘాలకు చెందిన నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నజీర్ అహ్మద్, బాబు భాయ్, మైనుద్దీన్, గౌస్‌పీర్, దస్తగిరి మాట్లాడారు. హజరత్ ముఫ్తీ మహమ్మద్ అలీ బొగ్దాది, తన్వీర్ అహ్మద్, సుబాన్‌బాష, డాక్టర్ గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌పై భార్య ఫిర్యాదు

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మరియాపురంలో నివాసం వుంటూ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జోహన్నెస్‌పై అతని భార్య అరుణ చేసిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. జోహన్నెస్‌తో అరుణకు వివాహమై 20 సంవత్సరాలైంది. వీరికి నలుగురు సంతానం. ఇటీవల కడపలో రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు జోహన్నెస్ ఓ కేసులో నిందితుడిగా వుండి, జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం అతను సస్పెన్షన్‌లో ఉన్నాడు. కాగా కొన్ని రోజుల నుంచి భార్యను వేధించసాగాడు. దీంతో భార్య అతని వేధింపులకు తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వివాహిత అదృశ్యం



లలిత

కడప అర్బన్: కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుడ్డాయపల్లెలో నివాసం వుంటున్న అమరేశ్వర్‌రెడ్డి, తన భార్య లలిత (19) ఈనెల 18 నుంచి కనిపించడంలేదనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైదుకూరుకు చెందిన లలిత, తన తల్లిదండ్రుల వద్దకు 10 రోజుల క్రితం వెళ్లి, రెండు రోజుల క్రితం మరలా భర్త వద్దకు వచ్చింది. ఈ నెల 18న ఉదయం 9గంటలకు తాను కడప నగరంలో డిగ్రీ చదువుతున్న కళాశాలకు వెళ్లివస్తానని చెప్పి ఇంటికి రాలేదు. దీంతో తన భార్య ఇంటికి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రిమ్స్ సీఐ రామచంద్ర ఆధ్వర్యంలో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం సాయిపేటలో ఆటోలో ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న సయ్యద్ ఆకుల జిలానీ బాషాను సీఐ సయ్యద్‌హాసం, తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 1200 కిలోల బరువున్న 30 బస్తాల ప్రభుత్వరేషన్ బియ్యాన్ని, ఆటోతో పాటు స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కడప అర్బన్: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు. గురువారం జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో వాహనదారులకు పోలీసు అధికారులు, సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించారు. కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రాయచోటి రోడ్డులో వున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో సాయంత్రం వాహనదారులకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు భద్రతపై వాహనదారులు పాటించాల్సిన నియమాలపై సూచనలు చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను, కారు, జీపులు, తదితర వాహనదారులు సీటు బెల్ట్‌ను ధరించాలన్నారు.

కడప ఎడ్యుకేషన్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కడప ట్రాఫిక్ ఎస్ఐలు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా ఐటీఐ సర్కిల్ సమీపంలోని సాయిబాబా విద్యాసంస్థల వద్ద విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాహన దారులకు ట్రాఫిక్ నియమ నిబంధలను వివరించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

– ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్

వైవీయూ : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం కడప ఆర్ట్స్ కళాశాలలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జెనిటిక్స్ అన్న అంశంపై సైన్స్ అకాడమీ లెక్చర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ పరిశోధనల్లో ముందుకు సాగాలని సూచించారు. వర్క్‌షాపు కన్వీనర్ ఆచార్య ఎస్.బి. రామచంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు సైన్స్ అకాడమీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రీసోర్స్ పర్సన్ టి. శివానందప్ప, డా. ఎం. సుబ్బారెడ్డి , వర్క్‌షాపు సమన్వయకర్త డా. పి. కల్పన మాట్లాడారు. కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు డా. ఎన్. వెంకటరామిరెడ్డి, డా. అనుప్రసన్న, కళాశాల అధ్యాపకులు డా. రవిశేఖర్, డా. వై. సావిత్రి, డా. నరసింహారావు, డా. శ్రీనీత, డా. రాజేశ్వరి, బయపురెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్, రాజశేఖరరెడ్డి, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేమన జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయం

– మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



విజేతలైన విద్యార్థులతో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రెడ్ల సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : యోగివేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి జీఓ జారీ చేయడం అభినందనీయమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెడ్ల కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి జనసంఘ – కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో వేమన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వేమన పండితులకు, పామరులకు అర్థమయ్యేలా పద్యాలు చెప్పారని తెలిపారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్త అని, సమాజంలోని వివక్షను తన పద్యాలతో ఎత్తి చూపారన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నాగదస్తగిరెడ్డి, రెడ్ల కల్యాణ మండపం కన్వీనర్ పోరెడ్డి నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి, సమన్వయకర్త డాక్టర్ మూలె రామమునిరెడ్డి, జనసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి తదితరులు ప్రజా కవి, యోగి వేమన గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరు రెడ్డి జనసంఘ్ అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వేమన పద్య పోటీల్లో వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు రూ.12 వేలు, రూ.9వేలు, రూ.6వేలు చొప్పున పోరెడ్డి సుజాత ఫౌండేషన్ తరఫున పోరెడ్డి నరసింహారెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా జనసంఘ్ అధ్యక్షుడు డాక్టర్ మద్దిక సుబ్బిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల జనసంఘ్ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రా సీనియర్ జట్టుకు జిల్లా క్రీడాకారిణులు



ఎన్. రోజా



ఎ. శిరీష



శ్రీచరణి

కడప స్పోర్ట్స్: ఈనెల 29న బరోడాలో నిర్వహించనున్న బీసీసీఐ ఉమన్ వన్డే సీనియర్ విభాగం అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా మహిళల జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన ఎస్.ఆర్. శ్రీచరణి (లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్), ఎన్. రోజా (వికెట్ కీపర్), ఎ. శిరీష (ఆల్‌రౌండర్)లు ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్‌లు హర్షం వ్యక్తం చేశారు.

సెక్యూరిటీ గార్డు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కడప రూరల్ : సెక్యూరిటీ గార్డు పోస్టులకు అర్హత కలిగిన మాజీ సైనికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు నమూనా, నెలసరి వేతనం ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నిర్దేశిత రుసుంతో సంబంధిత సర్టిఫికెట్లను జత చేయాలన్నారు.దరఖాస్తులను ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కడపలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సూచించారు.

ఆకట్టుకున్న కిసాన్ మేళా

ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కిసాన్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపైన వ్యవసాయశాఖ, సేంద్రియ వ్యవసాయం, ఉద్యానశాఖ, నీటి పారుదలశాఖ, పశుసంవర్ధశాఖ, ఎరువుల కంపెనీ ప్రతినిధులు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

– కడప అగ్రికల్చర్



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలతో ఏర్పాటు చేసి స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు



యంత్రాల పనితీరును వివరిస్తున్న వ్యవసాయ అధికారులు



డ్రోన్ పరితీరు గురించి వివరిస్తున్న టెక్నీషియన్


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నగరంలోని రవీంద్రనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా భూమిపూజ చేశారు. గురువారం స్థానిక రవీంద్రనగర్‌లో బ్రిడ్జి వద్ద మొదటి వీధిలోని ఈ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలుగుదేశం హయాంలో వైఎస్సార్ జిల్లాను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకుగానీ, వైఎస్సార్ జిల్లాకుగానీ నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కడపలో సుమారు రూ.600కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, మాజీ కార్పొరేటర్ జమాల్‌వలీ, ఎస్. సుబ్బారెడ్డి, కమాల్‌బాషా, తోటక్రిష్ణ, ఉమైర్, గఫార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం



పెండ్లిమర్రి : కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని చీమలపెంట గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె వైపు నుంచి కడప వైపు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని చీమలపెంట గ్రామ సమీపం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో త్రీవ గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.